ప్రజా రిపబ్లిక్ స్పెషల్
ప్రతి అక్షరం ప్రజల కోసం
1
RNI No: APTEL/2023/87888
శనివారం
22 నవంబర్ 2025

విశ్వప్రేమకు ప్రతిరూపం సత్యసాయి:రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

పుట్టపర్తి, నవంబర్ 22, (రిపబ్లిక్ న్యూస్): సత్యసాయి మహాసమాధిని దర్శించుకోవడం తన అదృష్టమని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో నిర్వహించిన శ్రీసత్యసాయి శత జయంతి వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. సాయి కుల్వంత్ హాలులో సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. అనతంరం రాష్ట్రపతి ప్రసంగించారు. "విశ్వప్రేమకు ప్రతిరూపంగా సత్యసాయి జీవించారు. ఆయన బోధనలు లక్షల మందికి మార్గం చూపాయి. ఆయన సందేశంతో కోట్ల మంది భక్తులు మానవ సేవ చేస్తున్నారు. సత్యసాయి ట్రస్టు ద్వారా ఎంతో మందికి వైద్య సేవలు అందించారు. ఈ ట్రస్టుకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుతున్నాను" అని రాష్ట్రపతి అన్నారు.

కొత్త లేబర్ కోడ్స్.. 1991 ఆర్థిక సంస్కరణల తర్వాత వచ్చిన కీలక మార్పు:ఏపీ సీఎం చంద్రబాబు

అమరావతి, నవంబర్ 22, (రిపబ్లిక్ న్యూస్): కొత్త లేబర్ కోడ్స్.. భారత అభివృద్ధి దిశలో మైలురాయి అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. 1991 ఆర్థిక సంస్కరణల తర్వాత అత్యంత కీలక మార్పులుగా ఇవి నిలుస్తాయని చెప్పారు.



ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. వీటితో ఉద్యోగుల భద్రత మరింత బలోపేతమవుతుందని, వేతనాల హామీ ఉంటుందని పేర్కొన్నారు. కార్మికుల గౌరవం, హక్కులకు ప్రాముఖ్యత లభిస్తుందని వివరించారు. గిగ్ వర్కర్లకు ప్రత్యేక రక్షణతో పాటు మహిళలకు మరింత సమానత్వం కలుగుతుందని అభిప్రాయపడ్డారు. భారత కార్మిక విధానాలను అంతర్జాతీయ ప్రమాణాలకు సమీపంలోకి తీసుకువచ్చే కీలక అడుగు అని వివరించారు. ఈ చరిత్రాత్మక సంస్కరణను ఆమోదించిన ప్రధాని నరేంద్ర మోదీకి అభినందనలు తెలిపారు.

భగవాన్ సాయి సిద్ధాంతం ప్రపంచమంతా వ్యాపించింది:సీఎం చంద్రబాబు

పుట్టపర్తి, నవంబర్ 22, (రిపబ్లిక్ న్యూస్): సత్యసాయి బాబా తన సందేశాలతో చాలామందిలో పరివర్తన తెచ్చారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. పుట్టపర్తిలో శ్రీసత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. "నీటి సమస్య లేకుండా బాబా అనేక ప్రాజెక్టులు నెలకొల్పారు. విరాళాల రూపంలో వచ్చిన నిధులను ప్రాజెక్టుల నిర్మాణానికి వినియోగించారు.

అనేక గ్రామాల్లో లక్షల మందికి తాగునీరు అందించారు. ఎన్నో వైద్యాలయాలు స్థాపించారు. సత్యసాయి ట్రస్టుకు లక్షల మంది వాలంటీర్లు ఉన్నారు. మానవ సేవే మాధవ సేవ అని నమ్మి సత్యసాయి ఆచరించారు. భగవాన్ సాయి సిద్ధాంతం ప్రపంచమంతా వ్యాపించింది. దాన్ని మనమంతా అర్థం చేసుకోవాలి" అని చంద్రబాబు అన్నారు.

మాపై నమ్మకంతో భూములిచ్చిన రైతులకు ఎలాంటి అన్యాయం జరగదు:మంత్రి నారాయణ

అమరావతి, నవంబర్ 22, (రిపబ్లిక్ న్యూస్): రాజధాని రైతుల సమస్యల పరిష్కారంపై సీఆర్డీఏ కీలక సమావేశం నిర్వహించింది. రాజధానిలోని సీఆర్డీఏ కార్యాలయంలో త్రిసభ్య కమిటీ భేటీ అయ్యింది. ఈ కమిటీలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పురపాలక శాఖ మంత్రి నారాయణ, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ ఉన్నారు. సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, ముఖ్య అధికారులతో కమిటీ సమావేశమైంది. దీనికి రైతు జేఏసీ ప్రతినిధులు హాజరయ్యారు. రైతులు లేవనెత్తిన అంశాలపై పరిష్కారం దిశగా కమిటీ సమాలోచనలు చేసింది.

ఏ రైతుకూ ఇబ్బంది లేకుండా చేయడమే లక్ష్యమని మంత్రి నారాయణ అన్నారు. ప్రభుత్వంపై నమ్మకంతో భూములు ఇచ్చిన రైతులకు ఎలాంటి అన్యాయం జరగదని పేర్కొన్నారు. గతంలో జగన్ ప్రభుత్వ తీరు వల్ల రాజధానిలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని పెమ్మసాని అన్నారు. సమస్యలన్నీ పరిష్కరించాలని తమ కమిటీకి సీఎం సూచించారని తెలిపారు. "రాజధానిలో చాలా సమస్యలు పెండింగ్లో ఉన్నాయి. జరీబు భూముల సమస్యకు 30 రోజుల్లో పరిష్కారం చూపిస్తాం. సీఆర్డీఏ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి జరీబు భూములను గుర్తిస్తారు. గ్రామ కంఠాల సమస్య కూడా పరిష్కరిస్తాం. లంక భూముల సమస్యను జగన్ జఠిలం చేశారు. దీనిపై వైకాపా నేతలు కోర్టులో కేసులు వేశారు. అసైన్డ్ భూములను కొందరు అమ్ముకుంటే జగన్ ప్రభుత్వం తప్పుబట్టి ఆపేసింది. మిగతా ప్రాంతాల్లో అసైన్డ్ చట్టానికి, రాజధానిలో అసైన్డ్ భూములకు వ్యత్యాసం ఉంది. ఈ సమస్య పరిష్కారానికి మూడు నెలల సమయం పడుతుంది. 90 శాతం రైతులకు ప్లాట్ల కేటాయింపు పూర్తయింది. రాబోయే 15 ఏళ్లలో జనాభా పెరుగుదల అంచనాల ప్రకారం మౌలిక వసతులు కల్పిస్తాం. 20 రోజుల్లో డీపీఆర్ సిద్ధం చేస్తున్నాం. వచ్చే జూన్ నాటికి రాజధాని గ్రామాల్లో తాగునీరు, డ్రెయిన్ల నిర్మాణం పూర్తి చేస్తాం, మరో వారం తర్వాత త్రిసభ్య కమిటీ సమావేశమవుతుంది" అని పెమ్మసాని అన్నారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

'వారణాసి' మ్యూజికల్ అప్డేట్ ఇచ్చిన కీరవాణి.. ఎన్ని పాటలంటే..?



ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ట్రెండింగ్లో ఉన్న సినిమా 'వారణాసి'. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా తెరకెక్కుతోన్న ఈ యాక్షన్ అడ్వెంచర్ మూవీకి సంబంధించిన ప్రతి వార్త క్షణాల్లో వైరల్ అవుతోంది. తాజాగా అగ్ర సంగీత దర్శకుడు కీరవాణి ఈ సినిమా పై మ్యూజికల్ అప్డేట్ ఇచ్చారు. గోవా వేదికగా జరుగుతోన్న ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫి) వేడుకలకు హాజరైన కీరవాణి.. 'వారణాసి'లో సంగీతం ఎవరూ ఊహించని స్థాయిలో ఉంటుందన్నారు. "అభిమానులు ఈ చిత్రంలో అద్భుతమైన సంగీతాన్ని వింటారు. అంతకు మించి ఇప్పుడే ఈ ప్రాజెక్ట్ గురించి ఏం చెప్పలేను. 'వారణాసి'లో మొత్తం ఆరు పాటలు ఉంటాయి. మనం చేసే పని ఏదైనా కానీ.. దానిపై మనకు స్పష్టత, మనపై మనకు నమ్మకం ఉంటే ఏవిషయమూ గందరగోళంగా అనిపించదు. ఒత్తిడిగా కూడా ఉండదు. నాకు ఈ ప్రాజెక్ట్ విషయంలో ఎటువంటి గందరగోళం లేదు" అని చెప్పారు. ఇప్పటికే ఈ సినిమాలో 'రణ కుంభ' ఆడియో సాంగ్ ప్రేక్షకులను ఆకట్టుకుంటూ యూట్యూబ్లో ట్రెండ్ సృష్టిస్తోంది. రాజమౌళి తెరకెక్కించే సినిమాలకు ఆయన సోదరుడు కీరవాణి సంగీతం అందిస్తారు. గతంలో వీరిద్దరి కాంబోలో వచ్చిన 'స్టూడెంట్ నెం.1', 'యమదొంగ', 'మగధీర', 'ఈగ', 'బాహుబలి'లోని పాటలు నేటికీ సోషల్మీడియా రీల్స్లో వైరల్ అవుతూనే ఉన్నాయి. ఇక వీరి కాంబోలో వచ్చిన 'ఆర్ఆర్ఆర్'ని 'నాటు నాటు' పాటను ఆస్కార్ వరించిన సంగతి తెలిసిందే.

'వారణాసి' బడ్జెట్ ఎంతంటే!

ప్రస్తుతం 'వారణాసి'కి సంబంధించిన ఒక వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇందులో పలు భాషలకు చెందిన అగ్రతారలు నటిస్తున్న నేపథ్యంలో దీని బడ్జెట్పై వార్తలు వెలువడుతున్నాయి. వీరికి భారీ పారితోషికం ఇవ్వనున్నారని టాక్ వినిపిస్తోంది. ఇక ఈ చిత్రబడ్జెట్ ఏకంగా రూ.1100 కోట్లని ప్రచారం జరుగుతోంది. 2027 వేసవిలో ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

రిపబ్లిక్ స్పోర్ట్స్

రిషభ్ పంత్‌లో ఆ సత్తా ఉంది :రికీ పాంటింగ్

కోల్‌కతా టెస్ట్‌లో బ్యాటింగ్ చేస్తూ శుభ్మన్ గిల్ గాయపడిన విషయం తెలిసిందే. మొదటి మ్యాచ్లో రిటైర్డ్ అవుట్గా వెనుతిరిగిన అతడు, రెండో ఇన్నింగ్స్ లోనూ బ్యాటింగ్కు రాలేదు. ప్రస్తుతం గువాహటి వేదికగా జరుగుతున్న రెండో మ్యాచ్కూరీ అతడు దూరమయ్యాడు. దీంతో రిషభ్పంత్ కెప్టెన్సీ బాధ్యతలు తీసుకున్నాడు. టెస్టుల్లో టీమిండియాకు సారథిగా వ్యవహరించడం పంత్కు ఇదే తొలిసారి. ఈ విషయంలో ఆసీస్ మాజీ క్రికెటర్ రికీ పాంటింగ్.. రిషబ్పంత్కు మద్దతుగా నిలిచాడు. సిరీస్ మధ్యలో కెప్టెన్గా వ్యవహరించడం అంత సులువు కాదన్నాడు. "సిరీస్ మధ్యలో కెప్టెన్సీ బాధ్యతలు తీసుకోవడం అంత తేలికైన విషయం కాదు. ముఖ్యంగా మొదటి టెస్టో ఓటమి చవిచూశాక, కీలకమైన మ్యాచ్కు సారథ్య బాధ్యతలు నిర్వహించడం సవాలుతో కూడుకున్న పని. అయినా పంత్ తనకున్న అనుభవంతో ఈ పనిని సులువుగా చేయగలడు. ఆ సత్తా అతడిలో ఉందని నమ్ముతున్నా" అని రికీ పాంటింగ్ అన్నాడు. "జట్టులోని ఇతర ఆటగాళ్లకంటే.. వికెట్ కీపర్కు మ్యాచ్లో ఏం జరుగుతోందనే విషయంపై ఎక్కువ అవగాహన ఉంటుంది. అలాగే పంత్కు ఐపీఎల్లో దిల్లీ క్యాపిటల్స్ను నడిపించిన అనుభవం కూడా ఉంది. కాబట్టి ప్రస్తుత పరిస్థితిని అతడు చక్కగా హ్యాండిల్ చేయగలడనుకుంటున్నా" అని పాంటింగ్ అభిప్రాయపడ్డాడు. రికీ పాంటింగ్ గతంలో దిల్లీక్యాపిటల్స్ను కోచ్గా వ్యవహరించాడు. ఆ సమయంలో రిషబ్ పంత్ కెప్టెన్సీని అతడు దగ్గర్నుంచి చూశాడు. ఈ నేపథ్యంలోనే పంత్ కెప్టెన్సీ మీద పాంటింగ్ విశ్వాసం వ్యక్తం చేశాడు. ఇక.. కోల్కతా టెస్టో టీమిండియా 124 పరుగులను చేధించలేకపోయింది. దీంతో 30 పరుగుల తేడాతో ఓడిపోయింది. 0-1 తేడాతో సిరీస్లో వెనుకబడింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం గువాహటి వేదికగా జరుగుతున్న రెండో టెస్టో టీమ్ ఇండియా తప్పక గెలవాల్సిన పరిస్థితి. అప్పుడే ఈ సిరీస్ను డ్రా చేసుకోగలుగుతుంది.

ఇంటి చిట్కాలు

ఇంటి బాల్కనీలోనే మిరపచెట్లని పెంచండి, ఏం వేస్తే మిరపకాయలు ఎక్కువగా కాస్తాయంటే

పచ్చిమిర్చి.. ప్రతి కూరలో వేస్తుంటాం. వీటిని బయటి నుంచి వండుతుంటారు. అలా కాకుండా ఇంట్లోనే వీటిని ఈజీగా పెంచుకోవచ్చు.

చెట్లని పెంచాలంటే నేలపైనే పెంచాల్సిన అవసరం లేదు. ఇంట్లో కొన్ని పూల తొట్టెలు ఉన్నా సరే వాటిలో చక్కగా పెంచుకోవచ్చు. దీనికి కొన్ని టిప్స్ ఫాలో అయితే చాలు. దీంతో ఇంట్లోనే చక్కగా కెమికల్స్ వేయని చెట్లని పెంచుకోవచ్చు. అయితే, విత్తనాలు వేశాం.. చెట్లని పెంచామంటే కుదరదు. దీనికోసం కొన్ని చిట్కాలు ఫాలో అవ్వాలి. అవేంటో తెలుసుకోండి.

సరైన విత్తనాలు ఎన్నుకోవడం

మిర్చి అనగానే అన్నీ ఒకేలా ఉండవు. ఒక్కో రకం ఒక్కో చోట పెరుగుతాయి. కాబట్టి, ఇంట్లోనే చిన్న స్థలంలో పెరిగేందుకు అనువైన వాటిని ఎంచుకోండి. కాయెన్నె, జలపినో, బర్డ్ ఐ అనే రకాలు ఇంట్లోనే బాల్కనీ గార్డెన్లో పెరిగే రకాలు. ఇలాంటి రకాలని మనం ఇంట్లోనే చిన్న స్థలంలోనే పెంచుకోవచ్చు. కాబట్టి మీరు విత్తనాలను ఎంచుకునేటప్పుడు ఈ రకాల్నే తీసుకొచ్చి ఇంట్లోనే పెంచండి.

కంటెయినర్స్

చెట్ల రకాలను బట్టి వాటి వేర్లని బట్టి వేటికి ఎంత స్పేస్ కావాలో వాటినే తీసుకొచ్చి పెంచండి. సాధారణంగా ఓ తొట్టి వచ్చేసి 12 నుంచి 16 ఇంచుల లోతు, వెడల్పు అవసరం ఉంటుంది. అదే విధంగా, తేమ వెళ్లిపోయేందుకు వీలు కూడా ఉండాలి. అందుకోసం మీరు తొట్టిలకి అవసరమైనన్నీ రంధ్రాలను చేయండి. ప్లాస్టిక్, మట్టి, సిరామిక్ ఏ రకాల తొట్టిలను తీసుకున్నా వాటి నుంచి తేమ సరిగా ఉండేందుకు హెూల్స్ ఉండేలా చూసుకోండి.

ఎండ తగిలేలా

మిరపచెట్లకి ఎండ అవసరం. కాబట్టి, ఎక్కడైతే రోజు మొత్తంలో 6 నుంచి 8 గంటల పాటు ఎండ తగులుతుందో ఆ ప్లేస్‌ని చూసి అక్కడ చెట్లని పెంచండి. బాల్కనీలో ఎక్కువగా ఎండ తగులుతుంది. కాబట్టి, ఇక్కడ చెట్లని పెంచడం మంచిది. అదే విధంగా, చెట్లు సరిగా పెరగాలంటే వాటికి సపోర్ట్ అనేది చాలా అవసరం. ముఖ్యంగా, అవి కాయలు కాసేటప్పుడు కాబట్టి. చెట్లని పెంచేటప్పుడు ఏదైనా కట్టె లేదా చెట్లు పెంచే స్టాండ్ సపోర్ట్ ఉంచండి. దీంతో వాటి కొమ్మలు విరిగిపోకుండా సపోర్ట్గా ఉంటాయి.

మంచి మట్టి

చెట్లు పెరగడానికి మంచి మట్టి అవసరమవుతుంది. ఇందులో పోషకాలు ఉండేలా చూసుకోండి. దీనికోసం మీరే ఇంట్లోనే కంపోస్ట్‌ని తయారు చేయొచ్చు. అదే విదంగా, పర్లైట్ కూడా చాలా బాగా పనిచేస్తుంది. దీనిని వాడడం వల్ల వేర్ల దగ్గర నీరు నిల్చిపోకుండా హెల్ప్ చేస్తుంది. దీంతో వేర్లు కుళ్లిపోకుండా ఉంటాయి.

తగినంత నీరు

చెట్లకి నీరు పోయడం చాలా ముఖ్యం. తేమగా ఉండాలి. అంతేకానీ, మొత్తం నీటిలోనే ఉండాలని కాదు. నీరు రెగ్యులర్‌గా పోయండి. ముఖ్యంగా వేడిగా ఉన్నప్పుడు. కానీ, నీటిలో మొత్తం మునిగిపోకుండా చూసుకోండి. సరిగ్గా నీరు పెట్టడం అంటే ఎలా అంటే పైన ఉన్న మట్టిని ముట్టుకున్నప్పుడు పొడిగా ఉంటే నీరు పెట్టాలి.

ఎరువులు

మిరపకాయలు మంచిగా పెరగాలంటే మంచి ఎరువులు కావాలి. 2 నుంచి 3 వారాలకి ఓ సారైనా ఎరువులు వేయండి. దీనికోసం ఆర్గానిక్ కంపోస్ట్ కూడా వేయొచ్చు. అలా అని ఎక్కువగా కూడా వేయకూడదు. దీని వల్ల నైట్రోజన్ పెరిగి చెట్లకి కొన్ని మిరపకాయలే కాస్తాయి. మిరప చెట్లకి ఎక్కువగా పురుగు, కీటకాలు వంటివి పడతాయి. వీటి మీద ఓ కన్నేసి ఉంచండి. మీరు అలాంటి ఏవైనా పురుగు, కీటకాల్ని చూసినా నీటిని స్ప్రే చేసి ఆర్గానిక్ మందులు వేయండి. నీమ్ ఆయిల్ వంటివి వేయడం వల్ల పురుగుల వంటివి పట్టవు.

కోత

ఒక్కసారి చెట్లు పెరిగాక వాటిని సరైన టైమ్‌లో కోయాలి. దీనికోసం అవి ఏ రంగులో ఉంటాయో అంటే ఒక్కో రకానికి ఒక్కో రంగులో వస్తాయి. అలా వచ్చినప్పుడు వీటిని పదునైన కత్తెరతో కట్ చేయాలి. చెట్టుకి కాస్తా కొమ్మ ఉంచి ఆ తర్వాత వాటిని కట్ చేయండి. అదే విధంగా, అప్పుడప్పుడు చెట్లని కత్తిరించడం కూడా చాలా ముఖ్యం. ఎండిపోయిన ఆకులు, పసుపు రంగులోకి మారిన ఆకుల్ని మనం తీసివేస్తే చెట్లు గుబురుగా చక్కగా పెరుగుతాయి. ఎక్కడైనా ఆకులు పసుపు రంగులోకి మారినవి ఉంటే వాటిని తీసేయడం మంచిది.